ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
ఆదివారం 27 ఏప్రిల్ 2025



బలవంతపు వసూళ్లకు చెక్!



ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

- బెదిరించి రుణ వసూళ్లకు పాల్పడితే మూడేళ్ల జైలు
- కొత్త బిల్లు ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రుణాలిచ్చి, బలవంతపు వసూళ్లకు పాల్పడే సంస్థలకు మూడేళ్ల జైలు శిక్ష విధించేలా రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురానుంది. శాసనసభ సమావేశాల్లో శనివారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి.. రుణాలిచ్చే సంస్థలు బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బంది పెడుడుతున్న ఘటనలు అరికట్టేలా ఓ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ ముసాయిదా బిల్లు చట్టరూపం దాల్చితే బలవంతపు వసూళ్లకు చెక్ పడినట్లే. ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాలు, రైతులు, మహిళలు, మహిళా స్వయం సహాయక బృందాలు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు తదితర వర్గాలు తరచూ రుణసంస్థల బారిన పడుతున్నాయి. అదే అదనుగా రుణ సంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలతో ఈ వర్గాలను ఆకర్షిస్తున్నాయి. అధికమైన రుణంతో తట్టుకోలేని బాధితులు, మరో సంస్థకు వెళ్లి రుణం పొంది పాత రుణం చెల్లిస్తున్నారు. అలా, రుణాలు చెల్లించని వారిని సదరు సంస్థలు మానసికంగా వేధిస్తున్నాయి. ఈ వేధింపులు తట్టుకోలేక కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అలాంటి బాధితులను రక్షించేలా కొత్త చట్టం రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త చట్టం ప్రకారం, బలవంతంగా రుణాల వసూళ్లకు పాల్పడితే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. అలాగే, ఈ చట్టంలో బలవంతపు వసూళ్లకు పాల్పడిన సమయంలో రుణగ్రహీతలు ఆత్మహత్యకు పాల్పడితే, రుణం ఇచ్చిన సంస్థ ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పరిగణిస్తారు. ఇలాంటి ఫిర్యాదు అందితే నాన్‌బెయిలబుల్ వారెంట్ ఖాయం. ఈ చట్టం ప్రకారం, రుణగ్రహీతలు, రుణ సంస్థల మధ్య వివాదాలు పరిష్కరించేలా ప్రభుత్వ తరఫున అధికారిని నియమించవచ్చు. రుణం ఇచ్చిన సంస్థలు, రుణ గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులపై బలవంతపు చర్యలకు పాల్పడడం, బెదిరించడం, వారి ఆస్తులు స్వాధీనం చేసుకోరాదు. రుణగ్రహీతలు, వారి కుటుంబ సభ్యుల వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడితే మూడేళ్ల జైలుశిక్ష, రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఉపముఖ్యమంత్రి ఉదయనిధి మాట్లాడుతూ.. ఈ చట్టం ప్రకారం, శిక్ష పొంది జైలుకెళ్లిన వారు బెయిలుపై బయటకు రాలేరని హెచ్చరించారు. కాగా, ఈ చట్టంలో పలు సవరణలు చేపట్టాలని అన్నాడీఎంకే సహా పలువురు సభ్యులు కోరారు. కాగా, తమ సలహాలు, సూచనలను రాతపూర్వకంగా అందజేయాలని స్పీకర్ అప్పావు విజ్ఞప్తి చేశారు.

కోవైలో 'గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్ 2025'

- ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించిన ఉదయనిధి

కోయంబత్తూర్ కొడీసియా ట్రేడ్ కాంప్లెక్స్‌లో త్వరలో 'గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్ 2025' జరుగనుంది. దీనికి సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శనివారం సచివాలయంలో ప్రారంభించారు. రాష్ట్ర నూతన పరిశ్రమల ప్రోత్సాహక సంస్థ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్ర పెట్టుబడులు రానున్న 2030 నాటికి ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, అందుకు పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కోవైలో త్వరలో గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్ 2025 నిర్వహించనున్నారు. ఈ సదస్సులో ప్రముఖ సంస్థలు, పెట్టుబడిదారులు, దేశ, విదేశాల యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సుమారు 30వేల మంది హాజరుకానున్నారు. సదస్సు నిర్వహించే ప్రాంగణంలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, వాతావరణ మార్పుల నిర్వహణ సంస్థ, మత్స్య, వ్యవసాయ శాఖల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సహా ప్రముఖ శాఖలు, పెద్ద పరిశ్రమలు, సంస్థల ఆధ్వర్యంలో సుమారు 750స్టాల్స్ ఏర్పాటుకానున్నాయి. ఈ సమ్మిట్ సందర్భంగా రూపొందిన ప్రత్యేక వెబ్‌సైట్ ఆవిష్కరణ.కార్యక్రమంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి టీఎం అన్బరసన్, అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్ ఆనంద్, సంస్థ సీఈఓ శివరాజ రామనాథన్ తదితరులు పాల్గొన్నారు.



యూపీఎస్సీ విజేతలతో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం

- ఎన్ని అడ్డంకులు వచ్చినా విడిచిపెట్టొద్దు
- విద్యార్థులకు సీఎం స్టాలిన్ హితవు
- యూపీఎస్సీ విజేతలకు ఘనసత్కారం

చదువే ఆయుధం

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యే మన ఆయుధమని, ఎన్ని ఆటంకాలు వచ్చినా విడిచిపెట్టవద్దని, విద్య ద్వారా సమాజానికి సేవలందించే ఉత్తమ పౌరులు తయారవుతారని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇటీవల యూపీఎస్సీలో 'నాన్‌ముదల్వన్' పథకం కింద శిక్షణ పొంది ఉత్తీర్ణులైన అభ్యర్థులను రాజా అన్నామలైపురంలోని అన్నా మేనేజ్‌మెంట్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రాంగణంలో శనివారం సీఎం ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ... రాష్ట్రంలో తన నాయకత్వంలో డీఎంకే ద్రావిడ తరహా పాలన అధికారంలోకి రావటంతోనే రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధిపరచాలని, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని భావించామని, పాఠశాలల విద్య, కళాశాలల విద్యను నాణ్యంగా అందించటానికే పరిమితం కాకుండా విద్యార్థుల ప్రతిభా పాటవాలను వెలికి తీసి వారిని ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ చర్యల్లో భాగంగానే 2022లో తన జన్మదినం సందర్భంగా 'నాన్ ముదల్వన్' పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఆ పథకంలో చేరి శిక్షణ పొందిన వారంతా ప్రస్తుతం యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావటం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. సామాన్య, నిరుపేద కుటుంబాల నుంచి కూడా సమాజసేవకు ఉపయోగపడే ఉత్తమమైన విద్యావంతులు రావాలనే లక్ష్యంతోనే తమ ప్రభుత్వం బడిపిల్లలకు ఉదయం అల్పాహార పథకం, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్లస్-2 ఉత్తీర్ణులై ఉన్నత విద్యాకోర్సుల్లో చేరే విద్యార్థినులకు 'పుదుమైపెణ్' పథకం, విద్యార్థులకు 'తమిళ్ పుదల్వన్' పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం తమిళ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు దేశవ్యాప్తంగా మంచి పేరుందని, అంకిత భావంతో పనిచేసే సత్తా తమిళులకే ఉందని భావిస్తుంటారని చెప్పారు. యూపీఎస్సీ విజేతలకు త్వరలో అధికారం రానున్నదని, ఆ అధికారాన్ని సమాజసేవకు వినియోగించాలని, అందరికీ ఆదర్శంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. యూపీఎస్సీ విజేతలకు తన చేతుల మీదుగా సత్కారం చేయడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి కయల్‌విళి సెల్వరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, అదనపు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విక్రమ్‌కపూర్, ముఖ్య కార్యదర్శి ప్రకాష్, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

విజయం మనదే

- ప్రజలను మోసం చేసిన ఎవరినీ అధికారంలోకి రానివ్వం
- కోవై టీవీకే బూత్ కమిటీ వర్క్‌షాప్‌లో టీవీకే అధినేత విజయ్

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో విజయం తమదేనని, ప్రజలను మోసం చేసే ఎవ్వరినీ అధికారంలోకి రానివ్వబోమని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. శనివారం కోయంబత్తూరు జిల్లా కురుంపాళయంలో రెండు రోజుల బూత్ కమిటీ సదస్సును ప్రారంభించిన విజయ్ మాట్లాడుతూ.. కోవై అయినా, కొంగు అయినా ముందుగా గుర్తుకు వచ్చేది ఈ భూమి పట్ల గౌరవమన్నారు. తమది ప్రజల నుంచి ఓట్లు ఎలా పొందాలన్న దానిపై జరిపే వర్క్‌షాప్ కాదని, ప్రజలతో ఎలా వ్యవహరించాలన్న దానిపై జరిగే వర్క్‌షాప్ మాత్రమేనని వివరించారు. "ఇంతకు ముందుగా చాలా మంది ఇక్కడకు వచ్చి ప్రజలను మోసం చేసేలా అబద్ధాలు చెప్పి ఉండవచ్చు. ఇక అలా జరుగదు. అధికారంలోకి రావాలనే మన లక్ష్యం ప్రజల సంక్షేమం కోసమే మాత్రమే. ఇక నుంచి ప్రజలను మోసం చేసి ఎవరూ అధికారం చేపట్టలేరు. మీలో ప్రతి ఒక్కరు సైనికుడితో సమానం. మేము ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నామని ప్రజలకు చెప్పండి. మన హృదయాల్లో నిజాయతి, దృఢమైన సంకల్పం, కష్టపడి పనిచేసే తత్వం, అంకిత భావం ఉన్నాయి. ప్రజలను వెళ్లి కలవండి. విజయం మనదే" అని పిలుపునిచ్చారు. అయితే విజయ్ కేవలం రెండు నిమిషాల్లోనే ప్రసంగం ముగించడంతో అభిమానులు కాస్త నిరుత్సాహానికి గురయ్యారు.

7 జిల్లాల నిర్వాహకులతో సదస్సు..

కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, కరూర్, నామక్కల్, సేలం తదితర 7 జిల్లాలకు చెందిన టీవీకే బూత్ కమిటీల నిర్వాహకులతో శని, ఆదివారాల్లో వర్క్‌షాప్ జరుగనుంది. తొలిరోజు వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు శనివారం ఉదయం నగరం నుంచి ప్రత్యేక విమానంలో కోయంబత్తూర్ వెళ్లిన విజయ్‌కు కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం అవినాశి రోడ్డులోని స్టార్ హోటల్‌లో విజయ్ విశ్రాంతి తీసుకున్నారు.

భారీ రోడ్ షో...

మధ్యాహ్నం 3 గంటలకు వర్క్‌షాప్ జరుగుతున్న ప్రాంతానికి చేరుకునేందుకు విజయ్ కారులో బయల్దేరారు. ఆయన వెంట వందలాది మంది కార్యకర్తలు ద్విచక్రవాహనాల్లో రావడంతో, అది రోడ్ షోగా మారింది. కారు పైనుంచి బయటకు వచ్చిన విజయ్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వేదిక వద్ద విజయ్‌కు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. సమావేశంలో విజయ్ 'పోలింగ్ బూత్‌ల వ్యూహం' అనే బుక్‌లెట్‌ను జిల్లా కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, పార్టీ ఎన్నికల సమన్వయకర్త ఆదవ్ అర్జునన్ సహా జిల్లా కార్యదర్శులు, బూత్ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆస్కాలో అలరించిన అష్టావధానం



అష్టావధానంలో పాల్గొన్న వారితో నిర్వాహకులు

ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ట్రస్ట్ (ఆస్కా ట్రస్ట్) ఆధ్వర్యంలో ద్విశతావధాని డాక్టర్ బులుసు అపర్ణ సారథ్యంలో 8 మంది మహిళలతో నిర్వహించిన అష్టావధానం విశేషంగా ఆకట్టుకుంది. టినగర్‌లోని ఆస్కా ప్రాంగణంలో శనివారం అతిథులు, నిర్వాహకుల జ్యోతి ప్రజ్వలన, అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆస్కా అధ్యక్షులు, ఆస్కా ట్రస్ట్ చైర్మన్ డా.కె.సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవధాన ప్రక్రియ తెలుగు వారికి గర్వకారణమని, దీనిని మద్రాసు మహానగరంలో తెలుగు వారికి కానుకగా అందించడం చాలా గర్వంగా ఉందన్నారు. స్వాగతోపన్యాసంలో ప్రముఖ ఆడిటర్ జేకే రెడ్డి పద్యాలతో ఆకట్టుకున్నారు. ముందుగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు మహిళలకు ఆస్కా ట్రస్ట్ తరఫున ఆర్థిక సహాయం అందించారు. అలాగే, జేకే రెడ్డిని 'సకలకళా వల్లభ' పురస్కారంతో సత్కరించారు. అనంతరం ద్విశతావధాని డా.బులుసు అపర్ణ అష్టావధాన ప్రక్రియ అద్భుతంగా నిర్వహించారు. ఇందులో పృచ్ఛకులుగా రాపర్తి ఝాన్సీ (నిషిద్ధాక్షరి), డా.తిరుమల అముక్త మాల్యద (సమస్య), డా.పీఎస్ మైథిలి (దత్తపది), డా.టి.మోహనశ్రీ (వర్ణన), డా.ఏవీ శివకుమారి (వ్యస్తాక్షరి), ఎస్పీ వసంతలక్ష్మి (వారగణనం), కమలాకర రాజేశ్వరి (ఆశువు), బిట్రా గజగౌరి (అప్రస్తుత ప్రసంగం)పై తమదైన రీతిలో ఆకట్టుకున్నారు. పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అపర్ణ అలవోకగా సమాధానాలు ఇస్తూ సందర్భానుసారంగా పద్యాలతోనూ అలరించారు. ఈ కార్యక్రమంలో ఆస్కా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పి.శ్రీనివాసులు రెడ్డి, ట్రస్టీ సెక్రటరీ ఎ.ఆదినారాయణ రెడ్డి, ట్రస్ట్ కోశాధికారి బీవీఎస్ కోటేశ్వరరావు, తమిళనాడు ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ సుధాకర రావు, ఆస్కా మాజీ అధ్యక్షులు ఎం.ఆదిశేషయ్య తదితరులు పాల్గొని, అష్టావధానంలో పాల్గొన్న కవులు, పండితులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రముఖులు సీఎంకే రెడ్డి, ఆనందకుమార్ రెడ్డి, చలపతిరావు, ఎం.రంగారెడ్డి, ఊరా లక్ష్మీ నరసింహారావు, డాక్టర్ కాసల నాగభూషణం, గాయని వినీషా తదితరులు పాల్గొన్నారు.

ఊటీలో ఉపరాష్ట్రపతి తోడ నృత్యం



తోడ కులపెద్దలతో ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశ్ ధన్కర్, గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పర్యటన నిమిత్తం ఊటీ వచ్చిన ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ శనివారం ఉదయం తోడ గిరిజనుల కుల దైవం ముత్తనాడు ముండ్‌తోడా ఆలయాన్ని సందర్శించారు. గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా ఉప రాష్ట్రపతితో అక్కడి కొండ ప్రాంతాల్లో నివసించే తోడ కులస్థులను కలుసుకున్నారు. ఆ సందర్భంగా తోడ సంప్రదాయక నృత్యం చేసిన ఆ గిరిజనులను ఉపరాష్ట్రపతి అభినందించారు. వారి కోరిక మేరకు కాసేపు నృత్యం చేశారు. వారితో గ్రూపు ఫొటో దిగారు. ఆ తర్వాత ఉపరాష్ట్రపతి ఊటీ రాజ్‌భవన్‌కు చేరుకుని, మధ్యాహ్నం వీసీల సమావేశానికి హాజరైన వీసీలు, ఇతర అధికారులతో కలిసి విందులో పాల్గొని కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం ఊటీ రాజ్‌భవన్‌లో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశ్‌ధన్కర్ వారి మాతృమూర్తుల జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రవి తదితరులు పాల్గొన్నారు.

విరుదునగర్, సేలం జిల్లాల్లో ఘోరం

- బాణసంచా పేలి ఏడుగురి దుర్మరణం
- మరో ఏడుగురికి గాయాలు

టి.నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శనివారం రెండు వేర్వేరు ఘటనల్లో బాణసంచా పేలి ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకేమారు రెండు చోట్ల బాణసంచా పేలి ఇంత మంది మరణించడంతో ఆయా ప్రాంతాల్లో విషాదం నెలకొంది. వివరాలిలా వున్నాయి... విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలో బాణసంచా తయారీ కర్మాగారంలో శనివారం ఉదయం సంభవించిన పేలుడులో ముగ్గురు మహిళా కార్మికులు మరణించగా, ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. శివకాశికి చెందిన జయశంకర్ అనే వ్యక్తి కాలయార్‌కురిచ్చి ప్రాంతం వద్ద బాణసంచా కర్మాగారం నడుపుతున్నారు. ఈ కర్మాగారంలో 30 గదుల్లో ఫ్యాన్సీ రకం బాణసంచా తయారు చేస్తుండగా రోజూ 50 మందికి పైగా కార్మికులు పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం బాణసంచా తయారు చేసేందుకు రసాయనాల మిశ్రమాన్ని సిద్ధం చేస్తుండగా హఠాత్తుగా గదిలోని మందుగుండు సామగ్రికి నిప్పంటుకుని ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీనితో రెండు గదులు నేలమట్టమయ్యాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు మరణించగా, ఏడుగురు శిథిలాల మధ్య చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిచిన ఎం.పుదుపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



టపాకాయల పేలుడుతో నేలమట్టమైన గదులు

ద్రౌపది అమ్మన్ ఆలయ వేడుకల్లో నలుగురు...

సేలం జిల్లా కాడయాంబట్టి తాలూకా కంచనాయకన్‌పట్టి గ్రామంలోని ద్రౌపది అమ్మవారి ఆలయ వేడుకల్లో ప్రమాదవశాత్తూ బాణసంచా పేలి నలుగురు మృతి చెందారు. 27 యేళ్ల తర్వాత ఈ వేడుకలు జరుగుతుండటంతో చుట్టుపక్కల 18 గ్రామాల ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. అంతేకాకుండా గ్రామస్థులు బృందాలుగా ఏర్పడి భారీ స్థాయిలో టపాసులు కొనుగోలు చేసి పోటీపడి కాలుస్తున్నారు. ఆదివారం జరిగే రథోత్సవానికి 18 గ్రామాలకు చెందినవారంతా ముందుగానే టపాసులు కొనుగోలుచేసి ఇళ్లలో భద్రపరుస్తున్నారు. ఆ మేరకు కోట్టమేడు ప్రాంతానికి చెందిన సెల్వరాజ్ (29), లోకేష్ (20) సహా ముగ్గురు చిన్నప్పంబట్టికి వెళ్లి బస్తా నిండుగా టపాసులు కొనుగోలు చేసి, మోపెడ్‌పై శుక్రవారం రాత్రి బయలుదేరారు. అదే సమయంలో అమ్మవారి ఊరేగింపు జరుగుతుండగా బాణసంచా కాల్చారు. ఆ సమయంలో మోపెడ్ మీద బస్తాలో ఉన్న టపాసులకు నిప్పంటుకున్ని పేలాయి. దీంతో అమ్మవారి ఊరేగింపులో నడుస్తున్న భక్తులంతా ప్రాణభయంతో నలుదిక్కులా పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో మోపెడ్‌కు దగ్గరగా ఉన్న ఎనిమిదిమందికి నిప్పంటుకుంది. సెల్వరాజ్, తమిళ్‌సెల్వన్ (11), కార్తీ (11) అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే దీవట్టిపట్టి పోలీసులు, అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా పోరాడారు. మృతదేహాలను పోస్టుమార్టం కు తరలించారు. నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వీరిలో సేలం ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకేష్ (20) శనివారం వేకువజాము మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని సేలం జిల్లా కలెక్టర్ బృందాదేవి, ఎస్పీ గౌతమ్ గోయల్ పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సీఎం స్టాలిన్ సంతాపం..

సేలం జిల్లా కంచనాయకన్‌పట్టి గ్రామంలోని ద్రౌపతి అమ్మవారి ఆలయ వేడుకల్లో టపాకాయలు పేలి నలుగురు మృతి చెందినట్లు తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ ప్రమాదంలో ఇద్దరు బాలురు సహా నలుగురు మృతి చెందారని, మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. మృతుల కుటుంబీకులకు తలా రూ.3లక్షల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

సమాచార దృష్టి

ఫిల్మ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో యూజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, సినిమాటోగ్రఫీ, సౌండ్ రికార్డింగ్, డైరెక్షన్ అండ్ స్క్రీన్ రైటింగ్, ఫిల్మ్ ఎడిటింగ్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ తదితర కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు www.filminstitute.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్లను మే 28వ తేది సాయంత్రం 5 గంటల్లోపు పంపించాలని ప్రకటనలో తెలియజేశారు.

'టాన్సెట్', 'సీటా' ఫలితాలు విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టాన్సెట్, సీటీ పరీక్షా ఫలితాలను అన్నా యూనివర్శిటీ శుక్రవారం విడుదల చేసింది. టాన్సెట్ పరీక్ష మార్చి 22న నిర్వహించగా 20,992 మంది, మార్చి 23న సీటా పరీక్షకు 4,632 మంది హాజరయ్యారు. ఈ ఫలితాలు www.tancet.annauniv.edu వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. అభ్యర్థులు తమ మార్కుల జాబితాను మే 7 నుంచి జూన్ 6వ తేది వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థుల ప్రవేశ కౌన్సిలింగ్ జూన్‌లో నిర్వహించనున్నట్లు, సందేహాల నివృత్తి కోసం tanceeta@gmail.com అనే ఈ-మెయిల్ సంప్రదించవచ్చని అన్నా వర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

నిరాశ్రయులైన పిల్లలకు బీమా

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శిశు సంక్షేమ కేంద్రాల్లో నివసిస్తున్న నిరాశ్రయులైన పిల్లలను ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకంలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుటుంబ కార్డు లేకుండా ముఖ్యమంత్రి బీమా పథకంలో చేర్చవచ్చని ప్రభుత్వం సూచించింది. ఈ ప్రకటన ద్వారా 843 శిశు సంక్షేమ కేంద్రాల్లో నివసిస్తున్న 15,092 మంది పిల్లలు ప్రయోజనం పొందనున్నారని సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

పిల్లలను గ్రంథాలయాలకు తీసుకెళ్లండి

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో పిల్లలను గ్రంథాలయాలకు తీసుకెళ్లాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... పిల్లలు సముద్రం, నదులు, చెరువులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలు ఇళ్లల్లోనే ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లలను గ్రంథాలయానికి తీసుకెళ్లి ఒక గంట సేపు కామిక్స్ నీతి కథలు, చరిత్ర, మహనీయుల జీవిత చరిత్ర తదితర పుస్తకాలు చదివించాలని తల్లిదండ్రులకు పాఠశాల విద్యాశాఖ విజ్ఞప్తి చేసింది.

ఊటీ, కొడైకెనాల్‌కు అదనపు వాహనాలకు అనుమతి

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఊటీ, కొడైకెనాల్‌లో నిర్వహించే వేసవి ఉత్సవాలకు అదనపు వాహనాలకు అనుమతివ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అదనపు వాహనాలు అనుమతించాల్సిన అవసరం ఉంటే, మరో 500 వాహనాలను అనుమతించవచ్చని తెలిపింది. ఊటీ, కొడైకెనాల్‌లో వాహన ఆంక్షలు విధిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సమీక్షించాలని కోరుతూ ప్రభుత్వ తరపున పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తులు ఎన్.సతీష్‌కుమార్, భరత్ చక్రవర్తిలతో కూడిన ధర్మాసనం, అదనపు వాహనాలకు అనుతించాలని నీలగిరి, దిండుగల్ జిల్లా కలెక్టర్లకు ఆదేశించింది.

పళని హుండీ ఆదాయం రూ.5.42 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.5.42కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. పళని ఆలయానికి ప్రతిరోజు వేలాది మంది భక్తులు వస్తుంటారు. భక్తులు స్వామివారికి కానుకలు సమర్పించేందుకు హుండీలు ఏర్పాటుచేశారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు గురు, శుక్రవారాలు జరిగాయి. లెక్కింపులో ఆలయ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులు, పళని ఆండవర్ ఆర్ట్స్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.5,42,62,088 నగదు, 1,131 గ్రాముల బంగారం, 21.324 కిలోల వెండి, 1,619 విదేశీ కరెన్సీ నోట్లు కానుకగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పన్ను చెల్లింపుదారులకు రూ.1.70 కోట్లు ప్రోత్సాహకం

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ఆస్తి పన్ను సక్రమంగా చెల్లించిన 3.25 లక్షల మందికి రూ.1.70 కోట్ల వరకు ప్రోత్సాహక నిధి అందజేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి అర్థవార్షిక పన్ను 30 రోజుల్లో చెల్లించిన వారికి, జీసీసీ తరపున 5 శాతం, అత్యధికంగా రూ.5వేల వరకు ప్రోత్సాహక నిధి అందిస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి అర్థవార్షికం ప్రారంభమైన ఈ నెల 1 నుంచి శుక్రవారం వరకు రూ.338.30 కోట్ల పన్ను వసూలైంది. ఈ విషయమై జీసీసీ రెవెన్యూ శాఖ అధికారి భాను చంద్రన్ మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో రూ.229.38 కోట్లు ఆస్తి పన్ను వసూలైందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.338.40 కోట్లు వసూలుచేశామన్నారు. నిర్ణీతకాలంలో పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ప్రకారం రూ.1.70 కోట్లు ప్రోత్సాహక నిధిగా అందజేశామన్నారు. ఈ నెల 30వ తేది వరకు రాయితీ ధర అందుబాటులో ఉంటుందని, ఆస్తుల యజమానులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆన్‌లైన్ పెట్టుబడి పేరిట మోసం

ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో ఓ యువకుడి నుంచి రూ.17 లక్షలు కాజేసిన వ్యవహారంపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు. కొద్దిరోజులుగా ఆన్‌లైన్‌లో నగదు మోసం చేస్తున్న కేసులు అధికమవుతున్నాయి. ఇలాంటి సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెట్‌పెట్‌కు చెందిన కజిత్ అనే యువకుడి వాట్సాప్‌కు ఒక లింక్ వచ్చింది. అందులో తక్కువ పెట్టుబడులతో అధిక లాభం పొందవచ్చని, దిగువ ఉన్న లింక్ క్లిక్ చేయాలని మెసేజ్ ఉంది. కజిత్ ఆ లింక్ క్లిక్ చేసిన వెంటనే అతని బ్యాంక్ ఖాతా నుంచి రూ.17.10 లక్షలు వేరే ఖాతాకు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఈ విషయమై కజిత్ అందజేసిన ఫిర్యాదుతో సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కొడైకెనాల్‌లో పర్యాటకులకు యాంటీ నక్సల్స్ ఫోర్స్ భద్రత

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం లోయలో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో నక్సల్ నిరోధక విభాగం పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. పర్యాటకులు సందర్శించే కీలకమైన ప్రాంతం వద్ద సాయుధ దళాలు కాపలాకాస్తున్నాయి. ఇటీవలే కొడైకెనాల్ నగరమంతటా పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటికి తోడుగా ఉద్యానవన ప్రాంతాల్లోనూ ప్రస్తుతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో పొరుగు రాష్ట్రాల నుండి పర్యాటకులు కొడైకెనాల్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరం చుట్టూరా తాత్కాలిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే అనుమతిస్తున్నారు.



కొడైకెనాల్ పార్కులో సేదతీరుతున్న పర్యాటకులు

వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ, గవర్నర్ రీకాల్ కోరుతూ ఎండీఎంకే ధర్నా

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలోని డీఎంకే పాలనకు అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్న గవర్నర్ రవిని రీకాల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎండీఎంకే ఆధ్వర్యంలో శనివారం దర్నా నిర్వహించారు. చెన్నై కలెక్టరేట్ ఎదుట ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ ఆందోళనలో డిప్యూటీ కార్యదర్శులు మల్లై సత్యాన వందియదేవన్, జిల్లా కార్యదర్శులు జీవన్, కే కళగకుమార్, న్యాయవాది సుబ్రమణి, రాజేంద్రన్, పూవై బాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో కేంద్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైగో తదితర నాయకులు

మాజీ ఎమ్మెల్యేల పింఛన్ రూ.35వేలకు పెంపు

● అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యులకు చెల్లించే పింఛన్, కుటుంబ సంక్షేమ పింఛన్, వైద్యభృతిని పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శాసనసభలో శనివారం ప్రకటించారు. మాజీ శాసనసభ్యుల పింఛన్ విషయం గురించి ప్రస్తావించారని, మరో సభ్యుడు జగన్‌మూర్తి కూడా మాజీ శాసనసభ్యులకు ఇచ్చే వైద్యభృతిని పెంచితే బాగుంటుందని సలహా ఇచ్చారని శాసనసభలో డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి తెలిపారు. వీరందరి సలహా సూచనలను పరిగణనలోకి తీసుకుని మాజీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలకు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌ను రూ.30 వేల నుండి రూ.35 వేలకు పెంచుతున్నట్లు సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ పెంచిన పింఛన్ ఈ ఏప్రిల్ ఒకటి నుండే వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పింఛన్‌ను రూ.15 వేల నుండి రూ.17,500లకు పెంచుతున్నట్లు తెలిపారు. మాజీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలకు ప్రతియేటా ఇచ్చే వైద్యభృతిని రూ.75 వేల నుండి రూ.రూ.లక్షకు పెంచుతున్నట్లు తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు రాష్ట్ర జాలర్ల నివాళి



తీరంలో లంగరు వేసిన పడవలు

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా మృతిచెందిన క్యాథలిక్ ఆలయ పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం జరిగాయి. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా రాష్ట్ర జాలర్ల సంఘం తరపున నివాళులర్పించారు. కన్నియాకుమిరి జిల్లా ఆరోగ్యపురం నుంచి నీరోడి వరకు ఉన్న 48 గ్రామాల జాలర్లు శనివారం చేపల వేటకు వెళ్లలేదు. అలాగే, ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు జాలర్లు హాజరయ్యారు. ఈ కారణంగా కుళచ్చల్, ముట్టం, తేంగాయపట్టణం, చిన్నముట్టం తదితర ప్రాంతాల్లో సుమారు 10 వేలకు పైగా ఫైబర్, మర బోటుల తీరానికే పరిమితమయ్యాయి.

అన్నాడీఎంకే సభ్యులు మాట్లేందుకు అనుమతించండి

● స్పీకర్ అప్పావుకు సీఎం స్టాలిన్ సిఫారసు

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల్లో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం సమాధానమిచ్చారు. ఆ సమయంలో అనుబంధ ప్రశ్న అడిగేందుకు అన్నాడీఎంకే సభ్యుడు దళవాయి సుందరం స్పీకర్ అనుమతి కోరారు. ఆ సమయంలో ఆయన తన సీట్లో కాకుండా కొంత దూరంలో ఉన్న మరో సీట్లో కూర్చున్నారు. దళవాయి సుందరం మాట్లాడేందుకు అనుమతించిన స్పీకర్, ఆ సమయంలో ఆయన తన సీట్లో లేరంటూ, తదుపరి బీజేపీ సభ్యులు సరస్వతికి సమయం కేటాయించారు. ఆ ప్రశ్న అనంతరం స్పీకర్ మరో సభ్యుడుకు అవకాశమిస్తున్న సమయంలో, సమావేశంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే సభ్యుడు దళవాయి సుందరం మాట్లాడేందుకు అనుమతించాలని కోరాడు. సీఎం సిఫారసుతో స్పీకర్ అనుమతితో దళవాయి సుందరం అనుబంధ ప్రశ్నపై మాట్లాడాడు. తొలుత తనకు అవకాశం కల్పించిన సీఎంకే దళవాయి సుందరం కృతజ్ఞతలు తెలుపడం గమనార్హం.

రెండేళ్లలో 25 మందికి 'డ్యుయల్ ఛాంబర్ పేస్‌మేకర్'

● నెల్లై ప్రభుత్వ ఆసుపత్రి సాధన



సమావేశంలో ప్రసంగిస్తున్న డీన్ రేవతి బాలన్

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న 25 మంది రోగులకు 'డ్యుయల్ ఛాంబర్ పేస్‌మేకర్' పరికరం అమర్చినట్లు తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రి డీన్ రేవతి బాలన్ తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీన్ మాట్లాడుతూ... ఈ పరికరం ఏర్పాటుకు ప్రైవేటు ఆసుపత్రులు రూ.7 లక్షల వరకు వసూలుచేస్తుండగా, ప్రభుత్వాసుపత్రుల్లో లక్ష కంటే తక్కువగా వేస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో ఏడాదికి సుమారు 2,500 మందికి యాంజియోగ్రామ్ చికిత్సలు అందిస్తున్నట్లు, అన్ని విభాగాల్లో ఆధునిక పరికరాలు ఏర్పాటుచేసినట్లు డీన్ తెలిపారు.

మాజీ మంత్రిపై హత్యాయత్నం కేసు

● రద్దుకు హైకోర్టు నిరాకరణ

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్‌పై నమోదైన హత్యాయత్నం కేసు రద్దుకు హైకోర్టు నిరాకరించింది. 2022లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ డీఎంకే సభ్యుడు నరేష్‌కుమార్‌పై జరిగిన దాడి వ్యవహారంలో మాజీ మంత్రి జయకుమార్, ఆయన మద్దతుదారులు 40 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ జయకుమార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణకు జయకుమార్ తరపున హాజరైన న్యాయవాది... డీఎంకే సభ్యుడు నరేష్‌కుమార్‌పై 10 కేసులున్నాయని, తాము ఎలాంటి ఆయుధాలతో దాడిచేయలేదని, స్వల్పగాయాలైన అతను ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది నాలుగు రోజుల్లో డిశ్చార్జి అయ్యారని తెలిపారు. రాజకీయ కక్షల కారణంగా నమోదైన కేసు రద్దు చేయాలని వాదించారు. విచారణలో జయకుమార్, ఆయన మద్దతుదారులు ఆయుధాలతో దాడి చేసినట్లు నిర్ధారణ అయిందని, అందువల్ల జయకుమార్ సహా 20 మందిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి ఛార్జీషీటు కూడా దాఖలుచేశామని పోలీసు శాఖ తరపు న్యాయవాది వివరించారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అందువల్ల జయకుమార్‌పై నమోదైన హత్యాయత్నం కేసు రద్దు చేయలేమని న్యాయమూర్తి తెలిపారు. అనంతరం కేసు వాపసు తీసుకుంటామని జయకుమార్ తరపున న్యాయవాది విజ్ఞప్తితో అందుకు అంగీకరించిన న్యాయమూర్తి, కేసు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

మయన్మార్ భూకంప నివారణ నిధికి వీఐటీ రూ.10 లక్షల విరాళం



మయన్మార్ దౌత్య కార్యాలయ అధికారికి విరాళం అందిస్తున్న కాదంబరి విశ్వనాథన్

వేలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లో సంభవించిన భూకంపం అనంతరం చేపట్టిన నివారణ చర్యలకు వేలూరు వీఐటీ ఉపాధ్యక్షులు సెల్వి కాదంబరి విశ్వనాథన్ రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ విరాళం వీఐటీ భోపాల్ తరపున న్యూఢిల్లీలోని మయన్మార్ దౌత్య కార్యాలయంలో అందజేశారు.

పహల్గాం దాడికి ఖండన



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న సంఘ నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాద దాడిని తమిళనాడు హోటళ్ల యజమానుల సంఘం తీవ్రంగా ఖండించింది. పుదుచ్చేరి నిలన్ గ్రాండ్ రిసార్ట్‌లో శుక్రవారం ఈ సంఘ సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు వెంకటసుబ్బు సమావేశం ప్రారంభించగా, సంఘ గౌరవాధ్యక్షులు వసంత భవన్ రవి, అడయార్ ఆనంద్ భవన్ శ్రీనివాస రాజ, విల్లుపురం సుబ్బురామన్, కడలూరు నారాయణన్ సహా పలువురు పాల్గొన్నారు. ఈ నెల 22న కశ్మీర్ లో జరిగిన ఉగ్రవాది దాడిని ఖండించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో మొదట పహల్గాం మృతులకు సంతాపం తెలుపుతూ రెండు నిముషాలు మౌనం పాటించారు.

రైళ్లలో పోలీసుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

వేలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రైల్వే పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో 27 మంది మృత్యువాతపడిన నేపథ్యంలో, దేశవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో, కాట్పాడి రైల్వేస్టేషన్‌కు వచ్చే రైళ్లలో సుమారు వంద మంది రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.

● పట్టాలపై బోల్టుల తొలగింపు వ్యవహారం..

ఆర్పీఎఫ్ విచారణ తీవ్రతరం

● రంగంలోకి ఎన్ఐఏ

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరువాలంగోడు సమీపంలోని రైలుపట్టాలపై బోల్టులు తొలగించిన వ్యవహారంలో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందమందిని రైల్వే పోలీసులు విచారిస్తుంగా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తన విచారణ ప్రారంభించింది. చెన్నై-అరక్కోణం మార్గంలోని తిరువాంగోడు రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై బోల్టులు, నట్లు తొలగించి ఉండడాన్ని శుక్రవారం వేకువజామున 1.14 గంటల సమయంలో తనిఖీ చేస్తున్న లైన్‌మన్ సెంథిల్‌కుమార్ గుర్తించాడు. అతడిచ్చిన సమాచారంతో అధికారులు, ఉద్యోగులు అక్కడకు చేరుకుని రైలు పట్టాలకు మరమ్మతులు చేపట్టారు. ఈ వ్యవహారంపై తిరువళ్లూర్ జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్, చెన్నై రైల్వే డివిజన్ మేనేజర్ విశ్వనాథ్ ఈర్య, ఆర్పీఎఫ్ ఐజీ ఈశ్వరరావు, రైల్వే భద్రతా దళం ఐజీ బాబు తదితరులు విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన సీసీ ఫుటేజీ ఆధారంగా, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వంద మందిని పోలీసులు విచారిస్తున్నారు. గతంలో గుమ్మిడిపూండి-కవరైపేట మధ్య రైలు ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు తిరువాలంగోడులో జరిగిన ఘటనకు సంబంధం ఉందా? రెండు ఘటనల్లో ఒకే ముఠా పాల్గొందా? అనే కోణాలతో విచారణ తీవ్రతరం చేశారు.

సమస్యలు పరిష్కారించాలని రేషన్ ఉద్యోగుల ధర్నా

వేలూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరుతూ రేషన్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయ సమీపంలో జరిగిన ధర్నాకు రేషన్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు నేతృత్వం వహించగా, రాష్ట్ర సెక్రటరీ సెల్వం ధర్నా ప్రారంభించారు. ధర్నాలో జిల్లా కోశాధికారి రమేష్‌కుమార్ సహా 150 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న రేషన్ ఉద్యోగులు

రాకెట్‌రాజా సహా ముగ్గురు రౌడీలకు 'నో ఎంట్రీ'

● కమిషనర్ అరుణ్ ఆదేశం



రౌడీలు సూర్య, రాకెట్ రాజా, లెనిన్

టినగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పేరుమోసిన రౌడీ రాకెట్‌రాజా సహా ముగ్గురు రౌడీలు నగరంలో ప్రవేశించకుండా గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ నిషేధ ఉత్తర్వు జారీ చేశారు. తిరునల్వేలి జిల్లా దిసైవినైకి చెందిన రాజా అలియాస్ రాకెట్ రాజా, కుండ్రత్తూరుకు చెందిన లెనిన్, కాంచీపురం నెడుంకుండ్రం ప్రాంతానికి చెందిన నెడుంకుండ్రం సూర్యాను గ్రేటర్ చెన్నై పోలీసు చట్టం సెక్షన్ 51 ఏ ప్రకారం నగర బహిష్కరణ ఉత్తర్వులిచ్చారు. ఈ ముగ్గురు రౌడీలు కోర్టు కేసుల విచారణకు హాజరుకావటం మినహా వేరే కారణాలతో నగరంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రవేశించకూడదని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధ ఉత్తర్వు యేడాదిపాటు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రౌడీ లెనిన్‌పై 6 హత్యకేసులు, 12 హత్యాయత్నం కేసులు సహా మొత్తం 28 కేసులు, నెడుంకుండ్రం సూర్యాపై 5 హత్యకేసులు, 12 హత్యాయత్నం కేసులు సహా 64 కేసులున్నాయి. ఇదే విధంగా రౌడీ రాకెట్ రాజాపై 5 హత్యకేసులు, 6 హత్యాయత్నం కేసులు సహా మొత్తం 20 కేసులున్నాయి.

యువకుడిని కరిచిన పిల్లి

● రేబిస్ నిర్ధారణ కావడంతో ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రేబిస్ వ్యాధి నిర్ధారణ కావడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మదురై జిల్లా అవనియాపురానికి చెందిన బాలమురుగన్ (25) కొద్దిరోజుల క్రితం ఇంటి మిద్దెపై నిద్రిస్తున్న సమయంలో, పక్కనే రెండు పిల్లులు పోట్లాడుకుంటున్నాయి. నిద్రలేచిన బాలమురగన్, పిల్లలను తరిమేందుకు యత్నించగా, ఓ పిల్లి బాలమురుగన్‌ను కరిచింది. దానిని బాలమురుగన్ పట్టించుకోకపోవడంతో, కొద్దిరోజుల తర్వాత గాయం పెద్దదైంది. దీంతో, ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న అనంతరం బాలమురుగన్, మదురై ప్రభుత్వ రాజాజీ ప్రభుత్వాసుపత్రిలో చేరగా, అక్కడ పరీక్షంగా రేబిస్ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. శుక్రవారం సాయంత్రం అతడు ఆసుపత్రి నుంచి తప్పించుకొనేందుకు యత్నించగా, రేబిస్ విభాగంలోని ప్రత్యేక గదిలో ఉంచారు. ఆ గదిలో తనకు అందజేసిన దుప్పటితో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మైనర్‌కు వివాహం చేశారంటూ కేసు

● రైలు కింద దూకి దంపతుల ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికకు వివాహం చేశారంటూ పోలీసులు కేసు నమోదుచేయడంతో తల్లిదండ్రులు రైలు కింద దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కృష్ణగిరి జిల్లా బర్గూర్ సమీపం జగదేవి ప్రాంతానికి చెందిన కుమార్ (50)-కవిత దంపతులకు కావ్య (17) అనే కుమార్తె ఉంది. కావ్య అదే ప్రాంతానికి చెందిన కార్తీక్ అనే యువకుడిని ప్రేమించింది. ఆ రెండు కుటుంబాల అంగీకారంతో పిల్లలకు వివాహం జరిపించారు. అయితే వారిద్దరు వేర్వురు వర్గాలకు చెందిన వారు కావడంతో, కార్తీక్ గ్రామంలో వ్యతిరేకత వచ్చింది. అలాగే బాలికను వివాహం చేసుకున్నాడని బర్గూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఈ విషయం తెలుసుకున్న బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ వ్యవహారంపై పోలీసులు కుమార్-కవితలపై కేసు నమోదుచేశారు. ముందస్తు బెయిలు కోసం మద్రాసు హైకోర్టుకు వెళ్తున్నామని చెప్పిన కుమార్-కవిత దంపతులు తిరుపత్తూర్ జిల్లా మేళకారన్‌పట్టి కీల్‌కురుంబార్ వీధి సమీపంలో రైలుపట్టాల దగ్గరకు వెళ్లి ఎదురుగా వస్తున్న రైలు కింద దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఏనుగు దాడిలో వృద్ధుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో వృద్ధుడు మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. అందియూర్ సమీపం విరాలికాట్టూరు గ్రామానికి చెందిన అంగప్పన్ (79) వంట చెరకు కోసం సమీపంలోని అడవికి వెళ్లాడు. అతను కట్టెలు ఏరుతున్న సమయంలో హఠాత్తుగా వచ్చిన ఏనుగు తొండంతో చుట్టి గిరగిరా తిప్పి విసిరేసింది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో అంగప్పన్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. చుట్టుపక్కల వారిచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అటవీ శాఖ అధికారులు, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీలంక జైలు నుంచి 14 మంది జాలర్ల విడుదల




జాలర్లతో మత్స్యశాఖ అధికారులు

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి 14 మంది రాష్ట్ర జాలర్లు విడుదలయ్యారు. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని ఆరోపిస్తూ శ్రీలంక నావికాదళం రామనాథపురం జిల్లాకు చెందిన 14 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. జాలర్లను విడుదల చేస్తూ శ్రీలంక కోర్టు కొద్దిరోజుల క్రితం తీర్పునిచ్చింది. శ్రీలంక నుంచి శుక్రవారం రాత్రి చెన్నై విమానాశ్రయం చేరుకున్న జాలర్లను మత్స్యశాఖ అధికారులు ఆహ్వానించి, ప్రత్యేక వాహనాల్లో వారి వారి స్వగ్రామాలకు పంపించారు.

పూజారి ఇంట్లో చోరీ

తిరుత్తణి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆలయ పూజారి ఇంట్లో నగదు, నగదు చోరీ జరిగిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పళ్లిపట్టు తాలూకా మేల్‌పూడి గ్రామంలోని ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న వెంకట సుబ్రమణ్యం శుక్రవారం రాత్రి భార్య, కుమార్తెలతో కలసి ఇంటి ముందు నిద్రపోయాడు. రాత్రి వేళ ఇంటి వెనుక వైపున్న తలుపు పగులగొట్టి లోనికి ప్రవేశించిన అగంతకులు, బీరువాలో ఉంచిన రూ.2 లక్షల నగదు, 5 సవర్ల బంగారం, 2 కిలోల వెండి వస్తువులు దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో తిరుత్తణి డీఎస్పీ కందన్ నేతృత్వంలో వేలిముద్ర నిపుణులు, పోలీసు జాగిలంతో చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించి, నిందితుల ఆచూకీ కోసం విచారిస్తున్నారు.

ఏటీఎంలో దోపిడీకి యత్నం



బద్దలు కొట్టిన ఏటీఎం మెషీన్


ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో దోపిడీకి యత్నించిన అగంతకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. తంజావూరు జిల్లా తిరువిడైమరుదూర్‌లో సిటీ యూనియన్ బ్యాంక్ ఏటీఎం ఉంది. శుక్రవారం అర్థరాత్రి దాటిన తరువాత 1 గంటకు కేంద్రంలో ప్రవేశించిన అగంతకుడు, ఏటీఎం మెషీన్ బద్దలు కొట్టి నగదు దోపిడీ చేసేందుకు యత్నించాడు. మెషీన్ బద్దులుకొట్టినా నగదు ఉంచే ప్రాంతం తెరిచేందుకు వీలుకాకపోడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కేంద్రానికి వచ్చిన వినియోగదారులు, మెషీన్ బద్దలుకొట్టి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా అగంతకుడి కోసం గాలిస్తున్నారు.

స్పా సెంటర్ల పేరుతో వ్యభిచారం

● యజమాని అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో స్పా సెంటర్లు నిర్వహిస్తూ, వాటిలో వ్యభిచారం చేయిస్తున్న యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నానగర్‌లోని స్పా సెంటర్ వ్యభిచారం జరుగుతుందనే సమాచారంతో రెండు నెలల క్రితం పోలీసులు నిఘా వేశారు.. ఆ సెంటర్‌లో ఉత్తరాది యువతులతో వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించి, ఆ యువతులను మైలాపూర్‌లోని మహిళా హోంకు తరలించారు. ఈ వ్యవహారంలో మేనేజర్ సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి, సెంటర్ యజమాని కోసం గాలిస్తున్నారు. ఆ యజమాని నగరంలోని 13 ప్రాంతాల్లో స్పా సెంటర్లు ప్రారంభించి వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఈ నేపథ్యంలో, మైలాపూర్‌లోని ఓ ఇంట్లో దాగిన స్పా సెంటర్ యజమాని హేమాజూలియో ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.

నయనతారతో విభేదాలా?


సుందర్ - నయనతార

● సుందర్ వివరణ

ప్రముఖ హీరోయిన్ నయనతారతో తనకు విభేదాలున్నట్టు జరుగుతున్న ప్రచారంపై ప్రముఖ దర్శకుడు సుందర్ సి స్పందించారు. మీరు అనుకున్నట్టుగా మా ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవని స్పష్టం చేశారు. సుందర్ దర్శకత్వంలో నయనతార ప్రధాన పాత్రలో 'మూక్కుత్తి అమ్మన్' రెండో భాగం తెరకెక్కుతోంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరూ గొడవపడినట్టు ప్రచారం జరిగింది. దీనిపై సుందర్ తాజాగా స్పందిస్తూ, 'మా ఇద్దరి మధ్య ఎలాంటి గొడవ జరగలేదు. ఈ వార్త ఎందుకు వ్యాపించిందో నాకు తెలియదు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ జరుగుతోంది. నిజానికి ఈ సినిమా షూటింగ్‌ను పొల్లాచ్చిలో ప్రారంభించాలని భావించాం. కానీ, నేను దర్శకత్వం వహించి నటించిన 'గ్యాంగర్స్' మూవీ వర్క్ ఉండటంతో చెన్నైలో ప్రారంభించాల్సి వచ్చింది. నయనతార చాలా అంకితభావం కలిగిన నటి. షూటింగ్ అర గంట ఆలస్యమైనా వెంటనే కేరవాన్‌కు వెళ్లమని చెబుతాను. కానీ, ఆమె మాత్రం లొకేషన్‌లోనే ఎక్కడో చోట ఉంటానని చెబుతారు. లొకేషన్‌లో ఒకసారి అడుగుపెట్టిన తర్వాత తిరిగి నేను బ్రేక్ చెబితేనే ఆమె కేరవాన్‌లోకి వెళతారు. పైగా మాపై జరిగే దుష్ప్రచారంలో ప్రతిదానికి స్పందించాల్సిన అవసరం లేదు' అని పేర్కొన్నారు.


'జైలర్-2'లో ఫహద్ ఫాజిల్


రజనీకాంత్ - ఫహద్ ఫాజిల్

సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'జైలర్-2' మూవీలో మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నటించనున్నారు. ఈ మేరకు ఆయన సంతకం చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఇప్పటికే 30 శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. మొదటి భాగంలో రజనీ భార్యగా రమ్యకృష్ణ, కోడలుగా మిర్నా నటించారు. రెండో భాగంలో వీరి ద్దరితోపాటు హాస్య నటుడు యోగిబాబు నటిస్తుండగా, మరో కీలక పాత్రలో ఫహద్ ఫాజిల్ నటిస్తున్నారు. అలాగే, రజనీ - ఫహద్ మధ్య వచ్చే సన్నివేశాలను త్వరలో షూట్ చేయనున్నట్టు తెలుస్తోంది. కాగా, గతంలో వీరిద్దరూ 'వేట్టయన్' మూవీలో కలిసి నటించిన విషయం తెల్సిందే. కాగా, జైలర్ మొదటి భాగం మెగాబ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో ఇపుడు రెండో భాగాన్ని నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు తొలి భాగంలో పనిచేసిన సాంకేతిక నిపుణులే పని చేస్తున్నారు.

చిత్రజ్యోతి

'ఎస్‌టీఆర్49'లో సంతానం


శింబు - సంతానం

ప్రముఖ నటుడు శింబు నటించే 'ఎస్‌టీఆర్49'లో హాస్య నటుడు నుంచి హీరోగా ఎదిగిన సంతానం నటించనున్నారు. ఈ విషయాన్ని ఆయనే తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ధృవీకరించారు. ఈ ప్రకటన శింబు, సంతానం అభిమానుల్లో జోష్ నింపింది. కోలీవుడ్‌లో హాస్య నటుడిగా అరంగేట్రం చేసిన సంతానం... ఇపుడు హీరోగా పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. తాను హీరోగా ఉన్నప్పటికీ తన కెరీర్ ఆరంభంలో తనకు అవకాశాలిచ్చి ప్రోత్సహించిన హీరోల చిత్రాల్లో కామెడీ పాత్రలు వేసేందుకు ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. ఇందులో భాగంగానే శింబు నటించే 'ఎస్‌టీఆర్49'లో నటించేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయంపై సంతానం మాట్లాడుతూ, 'నేను 'ఎస్‌టీఆర్ 49'లో శింబుతో కలిసి నటిస్తాను. ఒక రోజు శింబు నాకు ఫోన్ చేసి.. నా తదుపరి చిత్రంలో నటించాలని కోరగా, నేను సరేనని అంగీకరించాను. ఇంతకుమించి ఆ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలు వెల్లడించలేను' అని పేర్కొన్నారు.




SUNDAY SPECIAL

విక్టోరియా హాలుకు

నూతన సొబగులు



● భవనం ప్రాచీనత దెబ్బతినకుండా మెరుగులు

● రూ.32.62 కోట్లతో పునర్నిర్మాణ పనులు







చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు సమీపం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిపాలనా భవనానికి కూతవేటు దూరంలో ఇండోసార్సనిక్ (భారత మహమ్మదీయ) శిల్పకళా సౌందర్యంతో ఎరుపు రంగు గోపురంతో కూడిన చారిత్రక భవనం విక్టోరియా పబ్లిక్ హాలుకు పూర్వవైభవం కల్పించేందుకు కార్పొరేషన్ అధికారులు నడుం బిగించారు. ఆంగ్లేయుల కాలంలో నగరంలోని ప్రముఖులంతా సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం కోసం విరాళాలు వేసుకుని నిర్మించిన ఈ భవన నిర్మాణం 1888లో పూర్తికావటం, ఆ సమయంలోనే లండన్‌లో విక్టోరియా రాణి పదవీ స్వీకారం చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని గోల్డెన్ జుబ్లీ వేడుకలు జరుపుకోవడంతో ఈ భవనానికి విక్టోరియా పబ్లిక్ హాలు అనే పేరుపెట్టారు. ఈ భవనంలో జాతిపిత మహాత్మాగాంధీ సౌతాఫ్రికా నుంచి బారిస్టర్‌గా తిరిగొచ్చిన సమయంలో నగర ప్రముఖులతో కలిసి 'హరిశ్చంద్ర' తెలుగు నాటకాన్ని తిలకించారు. చికాగో సర్వమత సభలో ప్రసంగించి, భారతీయ ఆధ్యాత్మిక భావనలను పాశ్చాత్య దేశాల్లో వ్యాపింపజేసి స్వదేశానికి తిరిగొచ్చిన స్వామి వివేకానంద తొలిసారిగా భారతీయ పౌరుల మధ్యలో, ప్రత్యేకించి తమిళ, తెలుగు సోదరుల మధ్య ప్రసంగించిన స్థలం కూడా ఇదే. వెయ్యిమంది కూర్చునే సౌకర్యం ఉన్న ఈ హాలులో వివేకానందుడి ప్రసంగాన్ని వినటానికి పదివేల మంది వరకు రావటంతో హాలుబయట ఎద్దుల బండిపై నిలబడి స్వామీజీ ప్రసంగించారు. థియోసాఫికల్ సొసైటీ తొలి సమావేశం కూడా ఈ హాలులోనే జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులు గోపాలకృష్ణ గోఖలే, సర్దార్ వల్లభబాయ్ పటేల్ కూడా ఇదే హాలులో ప్రసంగించారు. ఇక జస్టీస్ పార్టీ ఆవిర్భావం కూడా ఈ హాలులోనే జరిగింది. ఈ హాలుకు ఆంగ్లేయ ఇంజనీర్ రాబర్ట్ ఫెల్లోస్ చిస్లోమ్ రూపకర్తగా వ్యవహరించారు. తెలుగువాడైన తాటికొండ నంబెరుమాళ్ చెట్టి కాంట్రాక్టర్‌గా ఈ భవనాన్ని నిర్మించారు. ఇక నగరంలో మద్రాస్ ఫొటోగ్రఫీ స్టోర్ నడిపిన టీ స్టీఫెన్ అనే వ్యక్తి ఓ ప్రొజెక్టర్ కొని మొట్ట మొదటిసారిగా ఓ చలనచిత్రాన్ని ఇక్కడే ప్రదర్శించారు. దీంతో సుగణవిలాస్ సభ ఆధ్వర్యంలో ఈ హాలులో ఎన్నో తెలుగు చారిత్రక, పౌరాణిక నాటకాలు కూడా ప్రదర్శించారు. ఇంతటి చారిత్రక ప్రాశస్త్యం సంతరించుకున్న విక్టోరియా పబ్లిక్ హాలుకు సింగారచెన్నై 2.0 పథకం కింద పూర్వవైభవం కల్పించే దిశగా జీసీసీ 2023లో పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది. ప్రస్తుతం చివరి దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాచీన చారిత్రభవనం ప్రాచీనతకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ హాలులో మొదటి అంతస్థులో ప్రస్తుతం ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. జూన్‌లోగా ఈ హాలు పునర్నిర్మాణ పనులన్నీ పూర్తవుతాయని కార్పొరేషన్ ఉన్నతాధికారులు చెప్పారు. ఈ హాలు పునర్నిర్మాణ పనులను సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు తరచూ పరిశీలిస్తున్నారు. అన్ని హంగులూ పూర్తయిన తర్వాత ఈ హాలులో గతంలా సభలూ, సమావేశాలు, సాంస్కృతిక, సాహితీ సమావేశాలను నిర్వహించనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తెలిపారు.

సమాజం మెచ్చేలా సేవా కార్యక్రమాలుండాలి

● అంతర్జాతీయ వాసవీక్లబ్‌ల అధ్యక్షుడు రామకృష్ణ


రామకృష్ణ, సుజాత రమేష్‌బాబు, సీఎం రాజేష్‌లతో క్లబ్‌ల సభ్యులు

ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సమాజం మెచ్చేలా వాసవీక్లబ్‌లు సేవకార్యక్రమాలు ఉండాలని అంతర్జాతీయ వాసవీ క్లబ్‌ల అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ సూచించారు. నుంగంబాక్కం పామ్‌గ్రోవ్ హోటల్‌లో శనివారం ఇంటర్నేషనల్ వాసవీక్లబ్స్ డిస్ట్రిక్ట్ వి502ఏ రీజియన్ 2 జోన్ 1 వాసవీ క్లబ్ చెన్నై, వాసవీ క్లబ్ వనితా గ్రాండ్ చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని ప్రసంగించారు. ఇంటర్నేషనల్ ట్రెజరర్ సుజాత రమేష్‌బాబు, డిస్ట్రిక్ట్ గవర్నర్ సీఎం రాజేష్, క్లబ్‌ల అధ్యక్షులు ఎ.సుధాకర్ - మీనాకుమారి, కార్యదర్శులు ఎం.జగదీష్ సింహం - జయలక్ష్మి, ట్రెజరర్లు ఊరా రమేష్ గుప్తా, వీఎన్‌వీ పద్మావతి, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ చారుగుండ్ల వెంకటేశ్వరరావుతో పాటు క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎక్స్‌టీఎఫ్‌ఏసీఈ బ్రాండ్ అంబాసిడర్‌గా

కయాదు లోహర్


మీడియా సమావేశంలో కయాదు లోహర్, కుమార్‌వేల్, వీణా కుమార్‌వేల్ తదితరులు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సౌందర్య సంరక్షణా బ్రాండ్ 'ఎన్‌ఎక్స్‌టీఎఫ్‌ఏసీఈ' బ్రాండ్ అంబాసిడర్‌గా నటి కయాదు లోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు సీకే కుమార్‌వేల్, వీణా కుమార్‌వేల్ ఆమెతో ఒప్పందర కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము కేవలం చర్మ సంరక్షణ సృష్టించడం లేదని, తాము ఒకరకమైన ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రామాణికత, సృజనాత్మకతకు ప్రసిద్ధి చెందిన ఆధునిక ఐకాన్ కయాదు అని, ఆమె ట్రెండ్ సెట్టర్ అని పేర్కొన్నారు. ఆమె అందం పట్ల నిర్భయమైన విధానాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు.

తీరప్రాంతాల్లో ముమ్మర నిఘా


తీరప్రాంతాల్లో కోస్ట్‌గార్డ్ దళాల గస్తీ

పెరంబూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడి అనంతరం తీరప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడుల నేపథ్యంలో, రామనాథపురం, కన్నియాకుమా జిల్లాల్లో 'సజాక్' పేరుతో నిఘాతో పాటు గస్తీ తీవ్రతరం చేశారు. రామేశ్వరం, పాంబన్, తంగచ్చిమఠం, మండపం, దేవిపట్టణం, కీళక్కరై ప్రాంతాలను కోస్ట్‌గార్డ్ తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అలాగే, కన్నియాకుమిరి నుండి కూడన్‌కుళం వరకు తీరప్రాంతాల్లోని జాలర్ల పడవలు, రికార్డులు సేకరిస్తున్నారు. సందేహాస్పదంగా ఉన్న వ్యక్తులు, పడవలపై '1093' అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు జాలర్ల గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సినీ దర్శకుడు నాగేంద్రన్ మృతి


నాగేంద్రన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీదర్శకుడు నాగేంద్రన్ శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. 2015లో 'కావల్' అనే సినిమా ద్వారా నాగేంద్రన్ కోలీవుడ్ దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత సీమాన్, వెంకట్ ప్రభు తదితరుల వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు. అశోక్‌నగర్ నటేశన్ రోడ్డులో నివసిస్తున్న నాగేంద్రన్ గత యేడాదిగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం రాత్రి ఆయన ఉన్నట్టుండి మూర్ఛిల్లారు. వెంటనే చుట్టుపక్కల వారు అంబులెన్స్‌ను పిలిపించగా, అంబులెన్స్‌లో వచ్చిన వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

నేత్రపర్వంగా శ్రీరంగనాథుడి

చిత్తిరై మహా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

టి.నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర వైష్ణవ దివ్యదేశాల్లో మొదటిది, భూలోక వైకుంఠం'గా విరాజిల్లుతున్న శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామివారి చిత్తిరై మహారథోత్సవం శనివారం ఉదయం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ ఆలయంలో 11 రోజులపాటు నిర్వహించే వార్షిక చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఈ నెల 18న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా స్వామివారు వివిధ వాహన సేవల్లో పాల్గొని భక్తులను అనుగ్రహించారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అద్దాల మండపం నుంచి బయలుదేరిన నంబెరుమాళ్ రజత అశ్వ వాహనాన్ని అధిరోహించి వండలూరు సప్పరంలో చిత్తిరై వీధుల్లో ఊరేగి రంగవిలాస మండపానికి చేరుకున్నారు. సాయంత్రం 6.30 గంటలకు అక్కడి నుండి స్వర్ణ అశ్వవాహనంలో బయలుదేరి వైయ్యాలి సేవలో పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు నంబెరుమాళ్ అద్దాల మండపానికి చేరారు. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన చిత్తిరై మహారథోత్సవం శనివారం వేకువ జాము నుండి ప్రారంభమయ్యాయి. రథోత్సవం కోసం ఉత్సవర్లు నంబెరుమాళ్ వేవుకుజాము 4.30 గంటలకు అద్దాల మండపం నుండి బయలుదేరి, 5 గంటలకు చిత్తిరై మహారథ ఆస్థాన మండపానికి చేరుకున్నారు. వేకువజాము 5.15 గంటలకు మేషలగ్నంలో సంపూర్ణ అలంకారంతో నంబెరుమాన్ రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఆ సందర్భంగా వైష్ణవ పండితులు, భట్టాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఉదయం 6 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్ళను పట్టుకుని లాగుతూ 'గోవిందా... గోవిందా' అంటూ భక్తులు నినాదాలు చేశారు. తూర్పు చిత్తిరై వీధి నుండి బయలుదేరిన ఈ మహారథం చతుర్మాడ వీధుల్లో ఊరేగి ఉదయం 9.30 గంటలకు రథమండప ప్రాంతానికి తిరిగి చేరింది. ఈ వేడుకల్లో తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు, కరూరు, పుదుకోట తదితర జిల్లాలకు చెందిన భక్తులే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు కూడా పాల్గొన్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.శివరామ్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది, పోలీసులు భక్తులకు తగిన సదుపాయాలు కల్పించారు. రథం ఊరేగిన చిత్తిరై వీధుల్లో దారి పొడవున స్థానిక భక్తజనసంఘాల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులకు మజ్జిగ, పానకం, అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డీన్‌గా డాక్టర్ కె.శాంతారామన్



టి.నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై రాజీవ్ గాంధీ స్మారక సర్వజనీన ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్) డీన్‌గా డాక్టర్ కె.శాంతారామన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆసియాలోనే అతిపెద్ద ప్రభుత్వాసుపత్రిగా పేరుగడించిన ఈ ఆసుపత్రికి మద్రాసు మెడికల్ కాలేజీ (ఎంఎంసీ) అనుబంధ విద్యా సంస్థగా సేవలందిస్తోంది. ఈ ఆస్పత్రిలో 3800 పడకలున్నాయి. 42 విభాగాలకు చెందిన వైద్యులు, నర్సులు సహా మొత్తం 2 వేలమందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. రోజూ 12 వేల నుండి 15 వేల మంది ఔట్‌పేషంట్లు చికిత్స పొందుతుంటారు. సుమారు 500 మంది ఇన్‌పేషంట్లు విశిష్టమైన చికిత్స పొందుతున్నారు. ఈ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎగ్మూరు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, ఎగ్మూరు కంటి ఆసుపత్రి, ప్రభుత్వ కస్తూర్బా ప్రసూతి ఆస్పత్రి, కీల్పాక్ మానసిక వైద్యశాల పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆసుపత్రి డీన్‌గా పనిచేసిన తెరనిరాజన్ వైద్య విద్యా పరిశోధనా మండలి అడిషనల్ డైరెక్టర్‌గా బదలీ కాగా, ఆ పదవిలో ఇప్పటి వరకూ పనిచేస్తూ వైద్య రంగంలో 34 యేళ్లకు పైగా అనుభవం కలిగిన డాక్టర్ శాంతారామన్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డీన్‌గా నియమితులయ్యారు.

స్పెక్ట్రా సంస్థలో చర్మసౌందర్యానికి

ఎండోలిఫ్ట్‌ఎక్స్ లేజర్ చికిత్స



కొత్త లేజర్ చికిత్స పరిచయ కార్యక్రమంలో నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్పెక్ట్రా మెడికల్ ఇండియా ఆధ్వర్యంలో చర్మ సౌందర్యం కోసం ప్రత్యేకంగా ఎండోలిఫ్ట్‌ఎక్స్ లేజర్ చికిత్సను ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు రామ్ తెలిపారు. నగరంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటలీకి చెందిన యూఫోటాన్ సంస్థ సహకారంతో చర్మాన్ని బిగుతు చేయడం, కొవ్వును తగ్గించడానికి ప్రవేశపెడుతున్న ఈ లేజర్ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూఫోటాన్ సంస్థ ప్రతినిధి బినాకా కోసిచ్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ జయంతి రవీంద్రన్, డెర్మటాలజిస్టులు డాక్టర్ చైతన్య, డాక్టర్ విగ్నేష్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి పుష్కరిణిలో వేసవి సందడి

తిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణి భక్తులతో కిటకిటలాడుతోంది. సాధారణంగా తిరుమలకు చేరుకునే భక్తులు ముందుగా పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న తర్వాత శ్రీవారిని దర్శించుకుంటారు. వేసవి కూడా తోడవడంతో ప్రస్తుతం పుష్కరిణి సందడిగా మారింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పుష్కరిణిలో కనిపిస్తున్నారు.

వీఐపీ కాటేజీలో నాగుపాము



తిరుమలలో వీఐపీలు బస చేసే స్పెషల్ టైప్ విశ్రాంతి భవనంలోని 14వ నెంబరు కాటేజీలోకి శనివారం ఐదున్నర అడుగుల నాగుపాము ప్రవేశించింది. భక్తులు భయంతో బయటకు వచ్చి భద్రతా సిబ్బందికి తెలియజేశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి .

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయి, క్యూలైన్ నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,536

తలనీలాలు సమర్పించినవారు: 30,612






నడకదారిలో సగం మెట్లు దాటగానే అలసిపోతున్నారు. ఛాతీ నొప్పితో కుప్పకూలుతున్నారు. నిర్జీవులుగా మారుతున్నారు కొందరు.

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ మరికొందరు గుండె పట్టుకుని విలవిలలాడుతూ కూర్చుంటున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లే సరికి విగతజీవులవుతున్నారు.

ఇలా దైవదర్శనానికి వచ్చే భక్తుల్లో గుండెపోటు మరణాలు ఇటీవల పెరిగాయి. ఏడాది కాలంలో దాదాపు 157 మంది భక్తులు గుండెపోటుతో మృతి చెందడం టీటీడీని కలవరపరిచింది. ఈ క్రమంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది.



నడకదారుల్లో గుండెపోటు



అలిపిరి నడకమార్గం

ఇటీవల పెరిగిన మరణాలు

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ ఇదే పరిస్థితి

ఏడాది కాలంలో 157 మంది మృత్యువాత

నివారణపై దృష్టిసారించిన టీటీడీ

తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి వచ్చేవారిలో దాదాపు 40 శాతం మంది భక్తులు తమకున్న మొక్కుల మేరకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు. అయితే కొవిడ్ అనంతరం కాలినడకన వచ్చే భక్తుల్లో చాలా మంది గుండెపోటుతో మృతి చెందుతుండటం టీటీడీకి ఆందోళన కలిగిస్తోంది. అప్పటివరకు బాగానే ఉన్న యాత్రికులు ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిపోయి కుటుంబానికి దూరమవుతున్నారు. ఒక కాలినడక మార్గాల్లోనే కాకుండా కంపార్టుమెంట్లు, క్యూలైన్లు, తిరుమలలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లోనూ గుండెపోటు మరణాలు నమోదవుతున్నాయి.





గతేడాది డిసెంబరు 13న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సీహెచ్ రవికుమార్ (ఇన్‌సెట్‌లో) రవికుమార్ మృతదేహం

ఇదీ లెక్క

గతేడాది జనవరిలో 14 మంది, ఫిబ్రవరిలో 11, మార్చిలో 12, ఏప్రిల్ 7, మే 8, జూన్ 11, జూలై 17, ఆగస్టు 9, సెప్టెంబరు 15, అక్టోబరు 10, నంబరు 8, డిసెంబరు 10, ఈఏడాది జనవరి 15, ఫిబ్రవరి 8, మార్చిలో (ఇప్పటి వరకు) ఇద్దరు చొప్పున 157 మంది గుండెపోటుతో చనిపోయారు. కాగా, మరికొందరు తీవ్ర అస్వస్థతతో తిరుపతిలోని వివిధ ఆస్పత్రుల్లో చేరి మృతి చెందిన సందర్భాలూ ఉన్నాయి.



గతేడాది డిసెంబరు14న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సెల్ఫీ తీసుకున్న నవనీత్.. (పక్కన) నవనీత్ మృతదేహం

ఏడో మైలు వద్ద అపోలో కేంద్రం

మరోవైపు శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అపోలో సంస్థ కొన్నేళ్లుగా ఉచితసేవలు అందిస్తోంది. అశ్విని ఆస్పత్రి పక్కనే ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఛాతీ నొప్పి అంటూ వచ్చేవారికి వివిధ రకాల పరీక్షలు చేయడంతో పాటు అత్యంత ఖరీదైన టెనెక్టిప్లెస్ అనే ఇంజెక్షన్ కూడా ఉచితంగా వేస్తున్నారు. ఇక, నడక మార్గాల్లో పెరుగుతున్న గుండెపోటు మరణాలను దృష్టిలో పెట్టుకుని అలిపిరి మెట్ల మార్గంలోని ఏడో మైలు వద్ద అపోలో సంస్థ 'అత్యవసర హృదయ చికిత్స కేంద్రం' ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. త్వరలోనే ఈసీజీ, డీఫిబ్ రిలేటర్, ఎకో కార్డియోగ్రామ్ వంటి పరికరాలతో వైద్యులను నియమించనున్నారు.

మరణాల నివారణ కోసం..

కాలినడకన వస్తూ తీవ్ర అలసటతో చాలా మంది భక్తులు మృతిచెందినట్టు టీటీడీ గుర్తించిది. అలాగే అనారోగ్యంతో ఉన్నవారూ మొక్కు తీర్చుకోవాలనే మొండితనంతో కొండెక్కుతూ చనిపోయినట్టు కూడా వైద్యుల ద్వారా తెలిసింది. ఈక్రమంలో శ్రీవారి దర్శనం కోసం వస్తూ గుండెపోటుతో ఇకపై ఎవరు మరణించకూడదనే లక్ష్యంతో టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 60 ఏళ్ల దాటిన వృద్ధులు, గుండె సంబంధిత, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ వంటి వ్యాధులున్న వారు కాలినడకన వెళ్లడం మంచిది కాదంటూ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా టీటీడీ సూచిస్తోంది.

- అలిపిరి నడకమార్గంలో ఇప్పటికే 1,500వ మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో సరిపడా వైద్యులను ఏర్పాటు చేయాలనే అధికారుల ఆదేశాల మేరకు గుండెకు సంబంధించిన ప్రత్యేక నిపుణులు ఏర్పాటు చేశారు. ఒక్కో డిస్పెన్సరీలో నలుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఈసీజీ, డీ ఫిబ్‌రిలేటర్ వంటి పరికరాలను, క్యాన్వాస్ స్ట్రచర్స్‌ను సమకూర్చుకున్నారు.
- ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని 1,200వ మెట్టు వద్ద కూడా మరో డిస్పెన్సరీని ఏర్పాటు చేసే అంశంపై టీటీడీ ప్రణాళిక రూపొందించుకుంటోంది.
- భక్తులు దర్శనం కోసం వేచిఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో ఉన్న డిస్పెన్సరీలోనూ సరిపడా వైద్యులను ఏర్పాటు చేయనున్నారు.
- వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోనూ నూతన డిస్పెన్సరీ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇటీవల 13 మంది వైద్య సిబ్బందిని కూడా కొత్తగా నియమించారు. ఇక, భక్తులు ఏదైనా ఇబ్బందికి గురైతే వైద్యులు వచ్చేవరకు నిరీక్షించకుండా సమీపంలోని సిబ్బందే సీపీఆర్ చేసేలా శిక్షణ ఇస్తున్నారు.

చెన్నైలో ఇండోనేషియా ట్రేడ్ ప్రమోషన్ సెంటర్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇండోనేషియా రాయబారి క్రిష్ణమూర్తి

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు గాను చెన్నైలో నూతన ఇండోనేషియా ట్రేడ్ ప్రమోషన్‌సెంటర్ (ఐటీపీసీ) ను ఇండోనేషియా ప్రారంభించింది. భారత్‌లోని ఇండోనేషియా రాయబారి హెచ్.ఇనా హెచ్.క్రిష్ణమూర్తి శనివారం రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీపీసీ చెన్నై డైరెక్టర్ సుగ్రోహో ప్రియో ప్రతోమో, చెన్నై డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ హేకల్, ఇండోనేషియా సీజీ ఎడీ వార్డోయో, ఐఎఫ్ఎస్ అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మనోళ్ల దగ్గర ఉండుంటాడులే' అనుకుని..

- దర్శనానికి వెళ్లిపోయిన తల్లిదండ్రులు
- గుర్తించి అప్పగించిన తిరుమల పోలీసులు

తిరుమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాత్రి తప్పిపోయిన ఆరేళ్ల పిల్లాడిని తిరుమల పోలీసులు ఉదయానికల్లా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కర్ణాటకలోని కాడెనందిహల్లికి చెందిన శేఖరప్ప, రేణుక దంపతులు ముగ్గురు పిల్లలు, మరికొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చారు. రాత్రి 8 గంటల సమయంలో తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 2 వద్ద టీ తాగారు. ఆ సమయంలో శేఖరప్ప ఆరేళ్ల చిన్న కుమారుడు మాన్విత్ కనిపించలేదు. తమ బంధువులతో కలిసి దర్శనానికి వెళ్లి ఉంటాడని భావించిన తల్లిదండ్రులు దర్శనానికి వెళ్లారు. వెనక్కి వచ్చి చూస్తే పిల్లాడు కనిపించలేదు. గాలించినా దొరక్కపోవడంతో టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా శనివారం ఉదయం ప్రచారం చేయించారు. యాత్రికుల సముదాయంలోని 4వ నెంబరు హాల్‌లో ఆరేళ్ల మాన్విత్‌ను గుర్తించిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

అలిగివచ్చిన మహిళ అప్పగింత

ఇంటి నుంచి అలిగి తిరుమలకు వచ్చిన ఓ మహిళను తిరుమల పోలీసులు తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విశాఖపట్నంకు చెందిన రమ్యరాజు(40) ఇంట్లో గొడవలతో మనస్థాపం చెంది 24వ తేదీన ఇంటి నుంచి తిరుమలకు చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆందోళన పడుతుండగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వారికి ఫోన్ చేసి, తిరుమలలో ఉన్నట్టు చెప్పింది. కుటుంబ సభ్యులు వెంటనే తిరుమల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ నెంబరు ఆధారంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద ఆ మహిళను గురించి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు రమ్యరాజును పోలీసులు అప్పగించారు.

భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు, శని త్రయోదశి కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.



క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరునాగేశ్వరం ఆలయంలో రాహు సంక్రమణ పూజలు

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):తంజావూరు జిల్లా తిరునాగేశ్వరంలోని నాగనాథ స్వామివారి ఆలయంలో శనివారం ఉదయం రాహు సంక్రమణ ప్రత్యేక పూజలు జరిగాయి. రాహువు మీన రాశి నుండి కుంభరాశిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఈ ఆలయంలో యాగాలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలలో పాల్గొనేందుకు శనివారం వేకువజామునే పలు ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి కలశాభిషేకం, క్షీరాభిషేకం చేసి స్వర్ణకవచాన్ని ధరింపజేసి, పూలమాలలతో అలంకరించారు.



నాగనాథస్వామి ఆలయంలో మూలవిరాట్టుకు పూజలు

అసెంబ్లీలో సెంథిల్ బాలాజీకి బదులుగా బిల్లును ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి

చెన్నై, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అక్రమనగదు బట్వాడా కేసులో బెయిలు కావాలా? మంత్రిపదవి కావాలో తేల్చుకోమంటూ సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంతో శనివారం ఉదయం శాసనసభలో మంత్రి సెంథిల్‌బాలాజీ ప్రవేశపెట్టాల్సిన బిల్లును న్యాయశాఖ మంత్రి రఘుపతి ప్రవేశపెట్టారు. ఆ సమయంలో సెంథిల్‌బాలాజీ సభలోనే ఉన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడేవారు, ప్రాణాంతకమైన మందుల వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారబోసేవారిని శిక్షించే విధంగా చట్టసవరణ చేస్తూ తయారైన బిల్లును సెంథిల్ బాలాజీ ప్రవేశపెడతారని సభ రోజువారీ కార్యక్రమాల వివరాల జాబితాలో ప్రకటించారు. అయితే ఆ బిల్లును న్యాయశాఖ మంత్రి రఘుపతి ప్రవేశపెట్టడంతో సెంథిల్‌బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేస్తారనే ఊహాగాలు చెలరేగుతున్నాయి.

అన్ని భాషలనూ గౌరవించాలి

- 'జనని' అధ్యక్షురాలు నిర్మల పళనివేల్
- డబ్ల్యూటీఎఫ్‌లో ముగిసిన ఉచిత తెలుగు తరగతులు



ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో డబ్ల్యూటీఎఫ్ నిర్వాహకులు

ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాతృభాషతో పాటు ఇతర భాషలు కూడా నేర్చుకుని గౌరవించాలని జనని సంస్థ అధ్యక్షులు డా.నిర్మల పళనివేల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) నిర్వహణలో ఉచిత తెలుగు తరగతులు పూర్తయిన సందర్భంగా శనివారం ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమం టి.నగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో జరిగింది. సమాఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల పళనివేల్ పాల్గొని, తెలుగు భాష రాయడం, చదవడం నేర్చుకున్న వారందరికీ ప్రశంస పత్రాలు అందజేసి సమాఖ్య నిర్వాహకులతో కలసి అభినందించా రు. ప్రత్యేకంగా టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయు లు మోహన్‌ను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల పళనివేల్ మాట్లాడుతూ... ఎక్కువ భాషలు నేర్చుకుంటే జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూటీఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు గోటేటి వెంకటేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.

భారతదేశం కళలకు పుట్టినిల్లు

- ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్‌కుమార్ రెడ్డి

ప్యారీస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భరతనాట్యం, కూచిపూడి తదితర సంప్రదాయ కళలకు భారతదేశం పుట్టినిల్లని ప్రముఖ పారిశ్రామికవేత్త, వేణుగోపాల్ విద్యాలయ పాఠశాల అధ్యక్షులు కె.అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. టి.నగర్‌లోని టీటీడీ దేవస్థానం శ్రవణం హాలులో శనివారం రాత్రి భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ రేజా రాణి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ చెన్నై ఏఈఓ పార్థసారథి, గౌరవ అతిథిగా అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ దుర్గా నటరాజ్, విశ్వకామాక్షి కళాలయ గురువు డా.నీరజ విశ్వనాథ్, సపోర్టింగ్ డైరెక్టర్ ప్రణతి రెడ్డి, రోషిని తదితరులు పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీటీడీ చెన్నై పాలక మండలి మాజీ అధ్యక్షులు నూతలపాటి శ్రీకృష్ణ పాల్గొని, నిర్వాహకులు, కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.





కళాకారులతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు - కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న నూతలపాటి శ్రీకృష్ణ